క్లుప్తంగా

శిల్పారామంలో హర్ ఘర్ తిరంగా



చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప సెవెన్‌రోడ్స్: కడప శిల్పారామంలో హర్ ఘర్ తిరంగా ఉత్సవాలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. శిల్పారామం పరిపాలనాధికారి ఎస్.కృష్ణ ప్రసాద్ ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావులు దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను అర్పించారన్నారు. మహాత్ముడు చేసిన పోరాటం ఎంతో మందికి స్ఫూర్తినిచ్చి దేశ స్వాతంత్ర్య సాధనకు మార్గంగా నిలిచిందన్నారు. వందేమాతరం గీతంతోపాటు అఖిల్ డ్యాన్స్ అకాడమీ సహకారంతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి కార్యక్రమాలను మధుసూదన్‌బాబు పర్యవేక్షించారు.

వైభవంగా విజయదుర్గాదేవి కల్యాణం



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవారు

కడప సెవెన్‌రోడ్స్: కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారి శాంతి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణ క్రతువు నిర్వహించారు. కల్యాణ కర్తలకు ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ అమ్మవారి శేష వస్త్రాలు అందజేశారు.

పార్టీ అభ్యర్థులను గెలిపించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పూలభాస్కర్, శివకళ్యాణారెడ్డిలను గెలిపించాలని ఆ పార్టీ ఏఐసీసీ కోఆర్డినేటర్ ఎస్ఎ.సత్తార్ కోరారు. స్థానిక క్రిస్టియన్ లైన్‌లోని ప్రజాకేర్ ఆస్పత్రిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెదేపా, వైఎస్సార్‌సీపీ గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుని డబ్బును మంచినీళ్లలా ఖర్చు పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కోటపాటి లక్ష్మయ్య, అక్రమ్, ఆసిఫ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సుందరాచారి జయంతి



నివాళులర్పిస్తున్న శివారెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక సీపీ.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం సాయంత్రం శంకరంబాడి సుందరాచారి జయంతి నిర్వహించారు. పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు శంకరంబాడి సుందరాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భావాలతో వ్యవహరిస్తూ సుందర రామాయణం, సుందర భారతం, బుద్ధగీతి, సుందర సుధాబిందువులు వంటి పుస్తకాలు రచించి సుందరాచారి మంచిపేరు తెచ్చుకున్నారన్నారు. అనంతరం ఎన్.రమేశ్‌రావు, డా.తుమ్మలూరు సురేష్ బాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఎం.ప్రభాకర్, జయప్రసాద్, రంగ, చరణ్‌కుమార్, చంద్రశేఖరరెడ్డి, వెంకటరమణ, పేట మహేంద్ర, కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సీఐ, తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక(కుప్పం) ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కడప అక్కాయపల్లెలోని తిలక్ నగర్‌లో ఈ నెల 16వ తేదీ నుంచి చేపట్టనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ఆహ్వాన పత్రికలను కడప తాలూకా సీఐ రెడ్డెప్ప ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఐదు రోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షులు నవనీశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఈశ్వర్, సదానందుడు, రామనాథం, పెరుమాళ్, మణి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెండ్లిమర్రి : పాలతల మల్లేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలక మండలి సభ్యుల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆలయ ఈఓ కృష్ణానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి 20 రోజుల్లోపు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

గూడు చెదిరింది...ఫుట్‌పాత్ మిగిలింది!





పాత కలెక్టర్ కార్యాలయం వద్ద బస్సు షెల్టర్ కింద సుమారు 10 మంది నిరాశ్రయులు జీవనం సాగిస్తున్నారు. గత రాత్రి కురిసిన వర్షాలకు షెల్టర్ కూలి వారికి పెద్ద ప్రమాదం తప్పింది. అదృష్టవశాత్తూ ఎవరూ గాయపడకపోవడంతో నిరాశ్రయులు ఊపిరిపీల్చుకున్నారు. వారంతా ఫుట్‌పాత్‌పై చెట్టు నీడన సేద తీరుతున్న దృశ్యాలు హృదయవిదారకంగా కనిపిస్తున్నాయి. వర్షంలో తడుస్తూ గడిపిన వారికి ప్రభుత్వం భరోసా ఇవ్వకపోవడంతో దాతలు ఆహారం అందిస్తున్న దృశ్యాలివీ..

– సాక్షి ఫోటో గ్రాఫర్, కడప

సమాజాన్ని చైతన్యపరిచేలా రచనలు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ పుత్తా పద్మ

కడప ఎడ్యుకేషన్: తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరిచే అభ్యుదయ కవి డా.ఎన్.ఈశ్వరరెడ్డి అని వైవీయూ కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ అన్నారు. ఈశ్వరరెడ్డి రచించిన ×నిత్యబాలింత®, ×సమాజహితం సాహిత్యమతం® పుస్తకాల ఆవిష్కరణ సభ స్థానిక సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. సూర్య చారిటబుల్ ట్రస్టు, అభ్యుదయ రచయితల సంఘం, ఇంటాక్ కడప చాప్టర్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పుత్తా పద్మ మాట్లాడుతూ సమాజాన్ని సన్మార్గంలో నడిపించేలా ఈశ్వరరెడ్డి కవిత్వం ఉంటుందన్నారు. డా.బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కుల సచివులు డా.ఎల్‌వీకే.రెడ్డి మాట్లాడుతూ సామాజిక బాధ్యత, స్పృహ కలిగిన సంఘటనలు, ఇతివృత్తాలు ఈశ్వరరెడ్డి పుస్తకాల్లో కనిపిస్తాయన్నారు. అనంతరం అతిథులు డా.గోర్ల సూర్యనారాయణ, దార్ల వెంకటేశ్వరరావు, డా.గూటంస్వామి, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, లయన్ కె.చిన్నపరెడ్డి, ఎస్‌వీయూ పీసీ.వెంకటేశర్లు తదితరులు ఈశ్వరరెడ్డి రచనలను కవిత్వీకరించారు. రచయిత ఎస్.ఈశ్వరరెడ్డి స్పందిస్తూ పాఠకుల ఆదరణ తన రచనలకు పెట్టుబడి అని పదిమందికి ఉపయోగపడేలా తన జీవితముంటుందని పేర్కొన్నారు. అనంతరం డా.గోర్ల సూర్యనారాయణ, సుగుణ దంపతులను, అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కెఎన్‌పీ.రావు, ఎం.ప్రభాకర్, డా.తుమ్మలూరు సురేష్ బాబు, డా.ఎస్.రాజగోపాలరెడ్డి, రచయిత కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఈసీదే కీలకపాత్ర



మాట్లాడుతున్న కె.సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎన్నికల కమీషన్‌దే కీలకపాత్ర అని అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు పేర్కొన్నారు. కడప ఎస్టీయూ భవన్‌లో జరిగిన ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ రాగద్వేషాలకతీతంగా వ్యవహరించాలని కోరారు. ఆరోపణలు వచ్చినపుడు తన వివరణను సమంజసమైన ఆధారాలతో నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్లను తొలగించడం, బోగస్ ఓట్లను విచ్చలవిడిగా నమోదు చేయడం వంటి వాటిపై ఈసీ దాచివేత వైఖరి చూపడంతో అందరికీ సందేహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల పనితీరుపై విమర్శలను నివృత్తి చేయాలని, ప్రతి ఓటరును వారి ఆధార్‌తో లింకు చేయాలని సురేష్‌బాబు డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి యస్.మహబూబ్‌బాషా మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ లేవనెత్తిన విమర్శలకు, ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఎన్నికల కమీషన్‌పై ఉందన్నారు. బీహార్‌లో లక్షల ఓట్ల తొలగింపునకు సంబంధించి సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ వేదిక జిల్లా నాయకులు గౌరీశంకర్, బి.విశ్వనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

బాడీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ది కడప బాడీ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు రాజు ఆధ్వర్యంలో కడప నగరంలోని మిస్టర్ ఫిట్ జిమ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా రషీద్, ప్రధాన కార్యదర్శిగా యూనస్‌బాషా, కోశాధికారిగా మెరిన్‌ప్రసాద్, చైర్మన్‌గా ఈవీ.కుమార్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండీ.తాహిర్, గౌరవాధ్యక్షుడిగా నూనె నాగేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మెహరాజ్‌లను ఎనుకున్నారు. ముఖ్య అతిథిలుగా కడప జైల్ శాఖ అధికారి అమర్ బాషా, కమలాపురం జైల్ శాఖ అధికారి గంగాధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కుంటినాగేంద్ర, దేవిరెడ్డి ఆదిత్య, కార్పొరేటర్ షఫీ, కదిరి కిరణ్, తదితరులు పాల్గొన్నారు. అధ్యక్షుడు రషీద్ మాట్లాడుతూ బాడీ బిల్డర్స్ శ్రేయస్సు కోసం అసోసియేషన్ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, షేక్ సీమా, మైపుజ్‌అలీ, గౌస్, హఫీజ్, ఫయాజ్, మస్తాన్, ఖాజాఉస్మాన్, ఖాదర్, ఆరిఫ్, విజయ్‌కుమార్, రాజా పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో విజయం ఖాయం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఆర్.వెంకటసుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్: జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గాన్ని దివంగత వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి చేశారని, అందుకే వైఎస్సార్‌సీపీ ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఓటమి తప్పదని ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వేల్పుల రాములపై టీడీపీ నాయకులు హత్యాయత్నానికి ఒడిగట్టారన్నారు. తీవ్రంగా గాయపడిన వేల్పుల రామును ఏ1గా చేర్చి, మరో 50మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను మాత్రమే అరెస్టు చేసి, టీడీపీ నాయకుల అరెస్టు చూపకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. పారా మిలటరీ బలగాలతో బందోబస్తు ఏర్పాటుచేసి ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిరంజన్ రెడ్డి, బి.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న సంగమేశ్వరరెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులను బోదనకు దూరం చేస్తున్నారని ఎస్‌టీయూ కడప జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కడప ఎస్‌టీయూ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అసెస్‌మెంట్ బుక్స్‌లోని జవాబులను స్కాన్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో విద్యాశక్తి కార్యక్రమం స్వచ్ఛందంగా చేయాలనే విధి విధానాలు ఉన్నాయన్నారు. అయితే అకడమిక్ మానిటరింగ్ అధికారులు మెసేజ్‌లు పెట్టి నిర్బంధంగా చేయాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. జులై 31వ నాటికి పూర్తయిన కార్యక్రమాన్ని మార్చి 2026 వరకూ షెడ్యూల్ చేశారన్నారు. రోజూ ఫోటో, 30 సెకండ్ల వీడియో వాట్సాప్‌గ్రూప్‌లో పెట్టాలని మెసేజ్‌లు పెడుతున్నారని తెలిపారు. బలవంతంగా ఉపాధ్యాయులను నిర్బంధించి అదనపు తరగతులకు సమయం కేటాయించాలనడం సరికాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.రమణారెడ్డి, కె.బాలగంగిరెడ్డి, కొత్తపల్లి శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, రామ్మోహన్, ఎన్.వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, ప్రతాప్, పుల్లయ్య పాల్గొన్నారు.

2012 నాటి ఫలితాలే పునరావృతమవుతాయి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిశోర్ బూసిపాటి



విలేకరులతో మాట్లాడుతున్న కిశోర్ బూసిపాటి

కడప కార్పొరేషన్: పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో 2012 నాటి ఫలితాలే పునరావృతమవుతాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిశోర్‌బూసిపాటి అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పులివెందులలో పోటీ చేయడం వెనుక చంద్రబాబు, మంత్రి నారాలోకేష్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవిల కుట్ర దాగి ఉందన్నారు. ఒక జెడ్పీటీసీ గెలిచి రాష్ట్రం మొత్తం గెలుస్తామనే డబ్బా కొట్టుకునేందుకే లేనిపోని కుట్రలు చేస్తున్నారన్నారు. బీటెక్ రవి తన భార్యను గెలిపించుకొనేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి బయట ఉంటే గెలవడం కష్టమని భావించిన కూటమి నేతలు వారిని అరెస్టు చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారన్నారు. ఎన్నికల వేళ జమ్మలమడుగు నుంచి అల్లరి మూకలను తెచ్చి సాక్షిపై దాడి చేసేందుకు పథక రచన చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో రాయల్‌బాబు, లింగారెడ్డి పాల్గొన్నారు.

మేయర్ సురేష్‌బాబు జన్మదినం



కేక్ కోస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: కడప మేయర్ కె.సురేష్ బాబు జన్మదినం నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అపూర్వ కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు నాగయ్యయాదవ్ ఆధ్వర్యంలో బీసీ నాయకులు సురేష్ బాబుకు శాలువాకప్పి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యానాదయ్య, పి.జయచంద్రారెడ్డి, శివరామ్, కె.శివయాదవ్, రమేష్‌యాదవ్, నాగమల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం భారీ కేక్ కోశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురేష్‌బాబు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, ఉన్నత పదవులు పొంది ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. పి.జయచంద్రారెడ్డి, దాసరి శివప్రసాద్, షఫీ, ఇలియాస్ బీహెచ్, రామలక్ష్మణ్‌రెడ్డి, ఆర్‌వీ.రమణ, టీపీ.వెంకటసుబ్బమ్మ, బి.మరియ పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బి.నారాయణ

కడప ఎడ్యుకేషన్: అమరావతినేగాక.. వెనుకబడిన ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక(విపిఏ) రాష్ట్ర అధ్యక్షుడు బి.నారాయణ అన్నారు. కడప వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ అమరావతికి వేల కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి చేయడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కానీ వెనుకబడిన రాయలసీమను అభివృద్ధి చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పనులు పూర్తిచేసి సాగు, తాగునీరు అందించాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం వెనుకబడిన ప్రాంతాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిఆర్‌వీ.ప్రసాద్, సగిలి గుర్రప్ప కడప జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా సుబ్బరాయుడు, కార్యదర్శిగా ఆంజనేయులు, సభ్యులుగా సగిలి రాజేంద్రప్రసాద్, ఓరుగంటి నాగేంద్రబాబు, దాదాపీర్, సుబ్బరాయుడు, బాషాలను ప్రకటించారు. ఈ సమావేశంలో రవిశంకర్‌రెడ్డి, జయవర్ధన్, డబ్ల్యూ.రాము, కృష్ణ, అంకన్న, గోపి, సురేంద్ర, లెనిన్‌ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అబద్ధాలతో ప్రజలు విసిగిపోయారు

పులివెందుల టౌన్ : చంద్రబాబు అబద్ధపు కోతలతో ప్రజలు విసిగిపోయారని, సంక్షేమ పథకాలు అమలు ఒక్క జగన్‌తోనే సాధ్యపడతాయని, కుటిల బుద్ధితో రౌడీ రాజకీయలకు టీడీపీ శ్రీకారం చుట్టిందని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. ఆదివారం పులివెందుల మండలం అచ్చివెల్లి, ఎర్రిపల్లె గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి అనంతరం ఆయన మాట్లాడారు. పోలింగ్ బూత్‌ల మార్పుతో టీడీపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, పోలింగ్ రోజున ప్రజలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్‌రెడ్డిని అఖండ మెజార్టీతో ప్రజలు గెలిపిస్తారన్నారు, ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి అద్భుతమైన స్పందన ఉందన్నారు. కూటమి ప్రభుత్వంతో పూర్తిగా నష్టపోయామని, చంద్రబాబు మాటలకు కొంత ఆశపడటం వాస్తవమే ఇప్పుడు పర్యావసానంగా అనుభవిస్తున్నామని ప్రజలు చెబుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం 14 నెలల కాలంలో మేము ఇది చేశాం, మాకు ఓటు వేయండని చెప్పుకునే పరిస్థితిలేదు కాబట్టే మొదటి నుంచి అప్రజాస్వామిక పద్ధతిలోనే వ్యవహరిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నూతన రేషన్ కార్డు లేదు, కొత్త పింఛన్ లేదు, కొత్త ఇళ్ల పట్టా లేదని, ఇలా ఏదీ ఇవ్వలేదు కాబట్టే కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అప్రజాస్వామిక విధానంలోనే ఎలెక్షన్లకు వెళ్లాలనేది టీడీపీ ఉద్దేశ్యమన్నారు. ఎంత నీచంగా ప్రవర్తిస్తున్నారంటే భౌతిక దాడులు చేయడమేకాకుండా ప్రజలను నిర్మూలించాలని, అంతం చేయాలనే ఆలోచనలో కూడా ఉన్నారన్నారు. పోలింగ్ బూత్‌లను మార్చడం, పోలింగ్ శాతాన్ని తగ్గించడంవల్ల వాళ్లకు లాభం చేకూరుతుందని ఆలోచన టీడీపీకి ఉందన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, టీడీపీ ఏమి చేసినా దానికి దీటుగా ఎదుర్కొవడానికి వైఎస్సార్‌సీపీ క్యాడర్ సిద్ధంగా ఉందన్నారు. పోలింగ్ రోజున ఉదయం 7 గంటలకల్లా పోలింగ్ కేంద్రానికి చేరుకుని మీ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. అడవికి రాజు సింహం అయితే పులివెందులకు రారాజు వైఎస్ జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


అధ్యాపకులకు ఆధునిక పరిజ్ఞానం అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ శోభారాణి

కడప అర్బన్: ప్రతి పీజీ విద్యార్థి, అధ్యాపకులకు ఆధునిక పరిజ్ఞానం అవసరమని కడప ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.లక్ష్మీనరసమ్మ, పెథాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ జి.శోభారాణి అన్నారు. కడప రిమ్స్ ఆవరణంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పెథాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఎదుర్కోబోయే వ్యాధులు, వాటి నివారణ ఎలా చేయాలో తెలుసుకునేందుకు సమస్యలను పరిష్కరించుకునేందుకు వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీల్లో తిరుపతి స్విమ్స్ డాక్టర్ యోగశ్రీ, కడప జీఎంసీ డాక్టర్ సూర్యప్రభ, తిరుపతి స్విమ్స్ డాక్టర్ లక్ష్మీ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.బాలేశ్వరి, డాక్టర్ బి.గోపీకష్ణ, డాక్టర్ డి.ప్రవీణ్, డాక్టర్ వి.రాజేంద్ర, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపురంలో భారీ వర్షం



కోట వీధిలో నిలిచిన వర్షం నీరు

కమలాపురం : కమలాపురంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. భారీ ఉరుములతో కూడా వర్షం గంట పాటు ఏకధాటిగా కురవడంతో పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కోటవీధి, కృష్ణానగర్, మారుతి నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటి ఆవరణలోకి వర్షం నీరు వచ్చి చేరాయి. నివాసితులు, పాదాచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మున్సిపాలిటీలో డ్రైనేజ్ పనులు పెండింగ్‌లో ఉండటంతో మురికి నీరంతా రోడ్లపైకి వచ్చాయి. డ్రైనేజ్ పెండింగ్ పనులు పూర్తి చేసి వర్షం నీరు కాలువల్లో వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మరో వైపు వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉపశమనం లభించింది.

ఘనంగా మహేష్‌బాబు జన్మదినం



మహేష్‌బాబు కటౌట్ వద్ద అభిమానుల సంబరాలు

కడప ఎడ్యుకేషన్: మహేష్‌బాబు 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని కడప జిల్లా అభిమానులు స్థానిక రాజా థియేటర్ నందు కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు.అభిమానులు పాల్గొన్నారు. మహేష్‌బాబు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మౌలా మాట్లాడుతూ ఎంబీ ఫౌండేషన్ ద్వారా 4500 నిరుపేదలకు ఉచితంగా గుండె ఆపరేషన్ చేయించిన ఘనత మహేష్‌కే దక్కుతుందన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి పుట్టినరోజు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మహేష్ బాబు నటించిన అతడు సినిమాను రాజా, రవి థియేటర్లలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రసూల్‌ఖాన్, మౌలా, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణతో కూడిన ఉపాధి

కడప కోటిరెడ్డిసర్కిల్: నిరుద్యోగ యువతకు కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ఉన్నతి ఫౌండేషన్ సంస్థ అడ్మిషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్ లేదా ఇంటర్మీడియేట్, డిగ్రీ, డిప్లొమా పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు 18–28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, 35 రోజులపాటు బెంగళూరులో ఇచ్చే శిక్షణలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణానంతరం అవకాశం మేరకు వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంకన్న

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులను అసభ్యపదజాలంతో దూషిస్తే దాడి చేసిన పెండ్లిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. కడప పీడీఎస్‌యూ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రార్థనా సమయం కంటే రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చారనే సాకుతో ఓ లెక్చరర్ సాయంతో ప్రిన్సిపల్ కళాశాల విద్యార్థులను తమ చాంబర్‌కు పిలిపించి అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేయడం జరిగిందని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అయి పది రోజులు కావస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, కార్తీక్ పాల్గొన్నారు.

బుగ్గ శివాలయ ప్రాంతం స్వచ్ఛీకరణ



స్వచ్ఛీకరణ అనంతరం కోనేరు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గ శివాలయంలో ఉన్న అతి పురాతనమైన బుగ్గ మల్లేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని కోనేరు, పరిసరాలను ఆదివారం శుభ్రం చేశారు. పూర్వీకులు నిర్మించిన శిథిలావస్థలో ఉన్న కోనేటిని శుభ్రం చేయాలని బుగ్గమల్లేశ్వర దేవాలయ కోనేటి పరిరక్షణ వేదిక సభ్యులు, నాగిరెడ్డిపల్లె, గూడవాండ్లపల్లి, అగ్రహారం, బుగ్గలపల్లి భక్తుల కోరిక మేరకు కడప నగరం నుంచి వచ్చిన హిందూ భక్తులు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలు ఆదివారం కోనేటిని శుభ్రం చేశారు. అలాగే ఆలయాన్ని పరిశుభ్రం చేశారు. గూడా సదానందరెడ్డి, బొగ్గడి సుధాకరరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, బత్తల రామసుబ్బయ్య, తమ మిత్ర బృందంతో పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, నగలు, గంధం, పసుపు, వేపాకు, ప్రత్యేక పూలమాలలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే గంగమ్మ దేవాలయ సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలలో భక్తులు విశేష పూజలు చేశారు.